ఆఖరి మజిలీకీ అవస్థలే


విరిగిపోయిన సిమెంట్ బెంచీ

- సమస్యల సుడిలో జగన్నాథపురం శ్మశాన వాటిక
- బ్రిక్స్ ఊడి, శిథిలమైన ఫ్లోరింగ్‌తో బర్నింగ్ వేదికలు
- విరిగిపోయిన సిమెంట్ బెంచీ
- పేరుకుపోయిన బూడిద, వ్యర్థాలు

అక్కయ్యపాలెంలోని జగన్నాథపురంలో ఉన్న శ్మశాన వాటిక ప్రవేశద్వారం




శిథిలమైన డ్రెయిన్ గట్లు

సీతంపేట: అక్కయ్యపాలెం పరిధిలోని జగన్నాథపురంలో ఉన్న శ్మశానం అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. జీవీఎంసీ 42, 43, 44, 26 వార్డుల్లో నివసిస్తున్న సుమారు లక్షకు పైగా జనాభాకు అందుబాటులో ఉన్న శ్మశానం ఇది. గత కొంత కాలంగా నిర్వహణ లోపంతో కనీస సౌకర్యాలు లేక దహన సంస్కారాలకు ఇబ్బంది కలుగుతోందని జనం ఆవేదన చెందుతున్నారు. అపారిశుధ్యం, పలకలు ఊడి శిథిలమైన బర్నింగ్ ప్లేస్‌లు, అస్థికలు భద్రపరిచేందుకు సరిపోని లాకర్లు, అధ్వానంగా మారిన టాయిలెట్లు, విరిగిపోయిన సిమెంట్ బెంచీలు, పేరుకుపోతున్న వ్యర్థాలు, కానరాని పచ్చదనం , పాడైపోయిన ఫ్లోరింగ్ వంటి సమస్యలతో శ్మశానం రోత పుట్టిస్తోంది.


తలుపులు లేకుండా, చెత్తతో నిండిన టాయిలెట్లు

శిథిలమైన వేదికలు..

దహన సంస్కారాలు నిర్వహించడానికి నాలుగు వేదికలు ఉన్నాయి. అయితే నాలుగు చోట్ల పలకలు, బ్రిక్స్ ఊడిపోయి ఫ్లోరింగ్ అధ్వానంగా మారింది. దహన సంస్కారాలు చేసే వారు నడవడానికి, ప్రదక్షిణలు చేయడానికి వీలులేకుండా పోతోంది.

శిథిలమైన ఫ్లోరింగ్..

శ్మశానంలోని రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పలకలు ఊడిపోయి, గట్లు శిథిలమయ్యాయి. అలాగే కూర్చోవడానికి ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. దహన సంస్కార కార్యక్రమంలో పాల్గొనే వారు స్నానాలు ఆచరించడానికి మూడు బాత్‌రూమ్‌లు ఉన్నప్పటికీ నిర్వహణ లేక చెత్తా చెదారంతో, తలుపులు ఊడి రోత పుట్టిస్తున్నాయి. దీంతో ఆరుబయట స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. శ్మశానం చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ ప్లాస్టింగ్ చేయలేదు. ప్లాస్టింగ్ చేసి వాల్ ఆర్ట్‌తో చక్కటి పెయింటింగ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


బ్రిక్స్ ఊడి, శిథిలమైన ఫ్లోరింగ్‌తో బర్నింగ్ వేదికలు

తాండవిస్తున్న అపారిశుధ్యం..

శ్మశానంలో ఏ మూల చూసినా అపారిశుధ్యం తాండవిస్తోంది. దహన సంస్కారాల వల్ల ఏర్పడే బూడిదని తరలించక పోవడంతో పెద్ద కుప్పగా పేరుకుపోయింది. అలాగే సగం కాలిన కర్రలను కుప్పగా పడేశారు. వీటిని తరలించడం లేదు. గతంలో పారిశుధ్య సిబ్బంది శ్మశానాన్ని శుభ్రం చేసి వ్యర్థాలు తరలించే వారని, గత కొంత కాలంగా సిబ్బంది శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొరగా లాకర్లు..

సుమారు ఐదు వార్డులకు అందుబాటులో ఉన్న ఏకైక శ్మశానం కావడంతో ఎక్కువ తాకిడి ఉంటుంది. దహన సంస్కారాలు అయ్యాక కాశీ వెళ్లడానికి అస్థికలు భద్రపర్చుతుంటారు. దీని కోసం ప్రత్యేక గది ఉన్నప్పటికీ అందులో 12 లాకర్లు మాత్రమే ఉన్నాయి. అవసరాలకు సరిపోక చెట్లకొమ్మలకు అస్థికలు వేలాడదీస్తున్న పరిస్థితి. గ్రహణాలు వచ్చేటప్పుడు ఇబ్బంది వస్తుందని, కాశీ వెళ్లే వరకు అస్థికలు భద్రపర్చుకోవడానికి సరిపడేలా లాకర్స్ సంఖ్య పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అస్థికలు భద్రపరిచే గదికి ఉన్న చెక్క తలుపులు ఊడిపోవడానికి సిద్ధంగా ఉండటంతో భద్రత కరువైంది.

కానరాని పచ్చదనం..

నగరంలో చాలా ప్రాంతాలోని శ్మశానాలను ఇటీవల జీవీఎంసీ పచ్చదనంతో ఆహ్లాదకరమైన పార్కులుగా తీర్చిదిద్దింది. శ్మశానానికి వెళ్లామనే భావన లేకుండా ఒక పార్కుకు వెళ్లి వచ్చామనిపించేలా అభివృద్ధి చేశారు. అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించారు. శ్మశానం ఆవరణలో శివుని విగ్రహం, పచ్చని మొక్కలతో పార్కులా తీర్చిదిద్దారు. కూర్చోవడానికి బెంచీలు, స్నానానికి తగిన ఏర్పాట్లు, లాకర్లు ఏర్పాటు చేశారు. అక్కయ్యపాలెం శ్మశానం అభివృద్ధి, నిర్వహణను మాత్రం జీవీఎంసీ యంత్రాంగం పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. శ్మశానంలో మొక్కలు పెంచి పరిసరాలను ఆహ్లాదంగా తీర్చి దిద్ది, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.


ఊడిపోవడానికి సిద్ధంగా ఉన్న అస్థికలు భద్రపరిచే గది తలుపులు


శ్మశానంలో పేరుకుపోయిన బూడిద, వ్యర్థాలు

క్లుప్తంగా

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు


సత్యం సెంటర్ వద్ద అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

సీతంపేట: జాతీయ రహదారిపై కొత్తగా బీటీ రోడ్లు వేస్తున్నారు. గురుద్వారా నుంచి సత్యం సెంటర్ వరకు పాత తారు రోడ్డు గుంతలు పెట్టి కొత్తగా తారు రోడ్డు వేశారు. అయితే గురుద్వారా నుంచి సత్యం సెంటర్ వరకు గ్రీన్ బెల్ట్‌కు ఆనుకుని కొంత మేర కొత్త రోడ్డు వేయకుండా వదిలేశారు. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు స్కిడ్ అవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు ఉదయం నుంచి వర్షం కురవడంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా వదిలేసిన రహదారి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు


ఎస్.హర్షిణి


రోహిణి రూపశ్రీ

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం బి.హేమలత చెప్పారు. నొట్ల హర్షిణి (587 మార్కులు, స్కూల్ టాపర్) నూజివీడు ట్రిపుల్ ఐటీకి, దుక్క రోహిణి రూపశ్రీ (578 మార్కులు) శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిద్దరూ పేద విద్యార్థులు. హర్షిణి పెద్ద అక్క వరలక్ష్మి కూడా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఇదే పాఠశాల నుంచి ఎంపికై ప్రస్తుతం బీటెక్ చదువుతోంది. పాఠశాల హెచ్ఎం బి.హేమలత, ఫిజిక్స్ టీచర్ వీవీ జానకీ రామ్, గణిత ఉపాధ్యాయుడు శివరామ్ విద్యార్థినులను అభినందించారు. గత ఏడాది కూడా ఇదే పాఠశాల నుంచి పదో తరగతిలో 594 మార్కులు సాధించిన స్టేట్ ర్యాంకర్ తేజేష్ రెడ్డి నూజివీడులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికై చదువుతున్నాడు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తారా ప్రసన్నరెడ్డి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండే వినతులు అందాయి. జోనల్ కమిషనర్ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జి ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి వినతులు స్వీకరించి వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ దిలీప్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, సూపరింటెండెంట్లు రాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలకు డిమాండ్


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మహారాణిపేట: కులం పేరుతో తిట్టి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో సినిమా థియేటర్ ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఇప్పటికే ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. సంఘం జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కూటమి హామీలు గాలికి

- యువత పోరుకు భారీగా తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు, యువకులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర రావు తదితరులు

మురళీనగర్: కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి 49వ వార్డు నుంచి యువకులు అత్యధిక సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు ఆదేశాల మేరకు జిల్లా యువత అధ్యక్షతన నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు నేతృత్వంలో వార్డు క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా తరలి వెళ్లారు. జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి నిరసన తెలుపుతూ పాదయాత్రగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం యువత, విద్యార్థులు, జిల్లా నాయకులు విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అల్లు శంకర రావు మాట్లాడుతూ యువత, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన బకాయిలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న హామీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో 49వ వార్డు అధ్యక్షుడు అయినింటి రవికుమార్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి రొంగలి చంద్రమౌళి, జిల్లా స్టూడెంట్ విభాగం ఎక్జిక్యూటివ్ మెంబర్ పల్లా చైతన్య, 50వ వార్డు యూత్ అధ్యక్షుడు బి.శివరామ ప్రసాద్, జె.డి.మస్తాన్, ఎల్.వి.సుధాకర్, శ్రీను, ఐ.జగదీష్, రాంబాబు, రమేష్ నాయుడు, నందు, కె.కిషోర్, కోటి, వార్డు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'చెట్ల కొమ్మలు తొలగించండి'




శంకరమఠం రోడ్‌లో ఫుట్‌పాత్‌పై వదిలేసిన కొమ్మలు, దుంగలు

సీతంపేట: శంకరమఠం రోడ్‌లోని యాక్సిస్ బ్యాంకు ఎదుట ఫుట్‌పాత్‌పై ఉన్న భారీ వృక్షం తాలూకా కొమ్మ విరిగిపడటంతో జీవీఎంసీ హార్టీకల్చర్ సిబ్బంది తొలగించారు. తొలగించిన చెట్ల కొమ్మలు, దుంగలను మాత్రం తరలించకుండా ఫుట్‌పాత్‌పై వదిలేశారు. రెండు వారాలు గడిచినా తరలించక పోవడంతో పాదచారులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చెట్ల ఆకులు కుళ్లిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తరలించేలా సిబ్బందిని ఆదేశించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు బంగారమ్మతల్లి పండగ


బంగారమ్మతల్లి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి వార్షిక పండగ మంగళవారం జరగనుంది. అమ్మవారి పండగను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం, గ్రామస్తులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. ప్రియాగార్డెన్స్‌లోని అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. పుష్పాలు, భారీ ఎత్తున విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు ఉచిత ప్రసాద వితరణకు సన్నాహాలు చేశారు. గ్రామసాంప్రదాయం ప్రకారం రాత్రి అనుపుమహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. పాత అడవివరంలోని బంగారమ్మ సతకంపట్టు నుంచి పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు ఘటాలను ఊరేగింపుగా ప్రియాగార్డెన్‌లోని ఆలయం వద్దకు రాత్రి తీసుకువెళ్తారు. పండగ మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి తొలేళ్ల పండగని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి జోగిని, రాత్రి అమ్మవారి ఘటాలను గ్రామంలోపెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.


గ్రామంలో జోగి ఊరేగిస్తున్న గుడి పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు


సిద్ధం చేసిన అమ్మవారి ఘటాలు

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

సీతంపేట: ఇందు ఫైవ్‌స్టార్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నృత్యభారతి డ్యాన్స్ టీచర్ మౌనిక, నాట్య రవళి డ్యాన్స్ మాస్టర్ పాలకొండ మధు ఆధ్వర్యంలో చిన్నారులు శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నృత్యాలు ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు బి.ఎస్.రెడ్డి, మిమిక్రీ ఆర్టిస్టులు శ్రీనివాస్, జూనియర్ రాజబాబు తమ ప్రదర్శనలతో అలరించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు


సీతమ్మధారలో తనిఖీ చేస్తున్న జీవీఎంసీ అధికారులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 23వ వార్డు పరిధిలో గల పలు ప్రాంతాల్లో సోమవారం జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్, ఉన్నతాధికారుల ఆదేశాలతో సీతమ్మధార, సీతమ్మధార రైతుబజార్, చైతన్యనగర్, జాతీయ రహదారి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, వ్యాపారులకు అవగాహన కల్పించారు. పలువురికి జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ కవర్లు, నిషేధిత వస్తువులను సీజ్ చేశారు.

ఆకట్టుకున్న కల్లూరి శ్రీనివాస్ గాత్ర కచేరీ


ఆహూతులను అలరించిన విద్వాన్ శ్రీనివాస్ సంకీర్తనలు

దాబాగార్డెన్స్: రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన విద్వాన్ కె. శ్రీనివాస్ గాత్ర కచేరీ ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ ఎ.వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకుడు శ్రీనివాస్ కర్ణాటక సంగీతానికి సంబంధించి త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ సంకీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎస్. పార్థివ, ఘటంపై ఏఎస్ఆర్ కౌండిన్య వాద్య సహకారం అందించారు. కచేరీ అనంతరం సంస్థ తరఫున విద్వాన్ శ్రీనివాస్‌ని, వాయిద్య కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకట్రావు, వైస్ చైర్మన్ కె. సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పి.జగన్మోహనరావు, కోశాధికారి ఎం.మధుబాబు, సంయుక్త కార్యదర్శి వి.మధుసూదనరావు, ఎం.నాగేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


బలిదాన్ దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలో గల నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో సోమవారం బలిదాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను అర్పించిన భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు, మహనీయ జాతీయవాది డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశసమైఖ్యత కోసం ప్రాణత్యాగం చేసిన దినాన్ని గుర్తు చేసుకుంటూ ఈ బలిదాన్ దివస్‌ను నిర్వహించారు. బీజేపీ ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల 160 బూత్‌లలో ఈ నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ 'ఏక్ దేశ్ మే దో నిషాన్, దో విధాన్, దో ప్రధాన్ నహీ చలేగా'నినాదంతో దేశ సమైక్యత కోసం పోరాడి 1953 జూన్ 23న శ్రీనగర్ జైలులో రహస్య పరిస్థితుల్లో ప్రాణత్యాగం చేశారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్‌రాజు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు, పార్టీ నాయకులు సత్యారావు, శ్యామలదీపిక తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావద్దు


గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాసిన్ డైరెక్టర్ రవికిరణ్ తదితరులు

సీతంపేట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా 'మత్తు వద్దు, బంగారు భవిష్యత్తే ముద్దు'అనే నినాదంతో బాలవికాస్ ఫౌండేషన్ రూపొందించిన గోడపత్రికను అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఈదర రవికిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం మత్తుకు బానిస కావొద్దంటూ బాలవికాస్ ఫౌండేషన్ విస్తృత ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, వాళ్లకు అభిరుచి ఉన్న రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. బాలవికాస్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈనెల 26న కళాశాలల్లో మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అండ్ కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకరాల ప్రశాంత్, నాసిన్ సహాయ డైరెక్టర్ కె.ఆర్.ఎస్. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ప్రొఫెసర్‌పై కుల వివక్షను ఖండించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహారాణిపేట: తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డెయిరీ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న షెడ్యూల్ కులానికి చెందిన వి. రవివర్మని ఆ కళాశాలలో అసోసియేట్ డీన్‌గా పని చేస్తున్న రవింద్రారెడ్డి కుల వివక్షతో ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయాన్ని భీమ్ సేన వార్ తీవ్రంగా ఖండిస్తుందని ప్రతినిధులు తెలిపారు. సోమవారం కంచరపాలెంలో ఉన్న భీమ్ సేన వార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రెసిడెంట్ కొరమాటి చిన్నారావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కాలేజీలో అతని ఛాంబర్‌లో వేసిన టేబుల్, కుర్చీలు తొలగించి, కంప్యూటర్స్, ఫైల్స్‌ను ఇష్టం వచ్చినట్టు పడవేయించారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన అసోసియేట్ డీన్ రవీంద్రరెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ వి.వి. దుర్గారావు, జాయింట్ సెక్రటరీలు కొల్లబత్తుల ప్రసాదరావు, నామాల రేణు కుమార్, ట్రెజరర్ బల్లంకి కనకరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కృష్ణకుమారి, ఎం. చంద్రశేఖర్, ఐజక్ తదితరులు పాల్గొన్నారు.